

ఇంటిపై విరిగిపడిన చెట్టును పరిశీలిస్తున్న పోలీసులు.. (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన బాల గోవింద్ (ఫైల్‌ఫొటో)

ఇంటిపై విరిగిపడిన చెట్టు.. బాలుడి మృతి

ముసునూరు/దెందులూరు/మండవల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈదురుగాలులు, భారీ వర్షాల కారణంగా వేర్వేరుచోట్ల ముగ్గురు మృతి చెందారు. ముసునూరు మండలం చెక్కపల్లి జంగాలపేటలో మామిడి మారేశు పెద్ద చెరువు కట్ట పక్కన రేకులు షెడ్ వేసుకుని భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలతో నివాసముంటున్నాడు. ఆదివారం ఉదయం ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి వెలగచెట్టు విరిగి రేకులషెడ్‌పై పడింది. ఈ ప్రమాదంలో మంచంపై నిద్రిస్తున్న మారేశు కుమారుడు బాలగోవింద్ (12) తలకు తీవ్రమైన గాయమై మృతి చెందాడు. అక్కడే ఉన్న మారేశుకు కూడా తీవ్రంగా గాయపడ్డాడు. ఈదురుగాలుల తీవ్రతను చూసి తల్లి తన ఇద్దరు కుమార్తెలను ఇంటి పక్కన ఉన్న ఎంపీపీ పాఠశాలకు తీసుకెళ్లింది. కుమారుడి కూడా తీసుకెళ్లేందుకు తిరిగి వచ్చేలోగానే చెట్టు విరిగి పడింది. అదే ఇంటిలో కుటుంబం మొత్తం ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేదని కాలనీ వాసులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న నూజివీడు సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ ఎం.చిరంజీవి ఘటనా స్థలిని పరిశీలించి ఇంటిపై పడిన చెట్టును తొలగించి, బాలుడి మృత దేహాన్ని బయటకు తీశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ రమణ, ఎంపీడీవో బి.ఏ సత్యనారాయణ బాలుడి మృతిపై నివేదికను సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్‌కు పంపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రి తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. తండ్రి మారేశు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని ప్రాణహాని లేదన్నారు. ఏడవ తరగతి చదువుతున్న బాలగోవింద్ చలాకీగా ఉండేవాడని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రకృతి వైపరీత్యంతో తమ కళ్ల ముందే కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రుల రోదన చూపరులను కలిచివేసింది.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



మృతి చెందిన జార్జి

దెందులూరు పెద్ద దళితవాడకు చెందిన తానికొండ జార్జి (53) తాపీపని, రాడ్ బెండింగ్ పనులు చేస్తుంటాడు. వర్షం వల్ల పనికి సెలవు కావడంతో ఇంటి వద్దనే ఉన్నాడు. ఈదురుగాలులకు ఇంటి సర్వీస్ వైర్ తెగిపడి పోయింది. అది గమనించని జార్జి దానిని తొక్కడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. భార్య స్థానికుల సహాయంతో దెందులూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని రాగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య మాత్రమే ఉంది.

పిడుగుపాటుకు మరొకరు..

మండవల్లి మండలం దెయ్యంపాడులో పిడుగుపడి ఒక వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సైదు గిరిబాబు (33) రొయ్యల చెరువుపై పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం ఉదయం రొయ్యలకు మేత వేయడానికి వెళ్లగా ఆ సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు పిడుగుపడడంతో మృతి చెందాడు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గాలివాన.. బీభత్సం

జిల్లాలో పెనుగాలులు..కుండపోత వర్షం



ముదినేపల్లి మండలం పెదగొన్నూరు లో తెగిపోయిన విద్యుత్ లైన్లు



కైకలూరు రైతు బజార్ వద్ద జాతీయ రహదారిపై కూలిన చెట్టు





ఉంగుటూరులో తడిచిన ధాన్యం

- తడిచిన ధాన్యం.. ఉద్యాన పంటలకు నష్టం
- వేర్వేరుచోట్ల ముగ్గురి మృతి
- నేలకొరిగిన చెట్లు.. విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- ముసునూరు మండలంలో అత్యధికంగా 66.4 మిల్లీమీటర్ల వర్షపాతం
- స్తంభించిన జనజీవనం

ఏలూరు సిటీ, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లాలో ఆదివారం ఉదయం పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. పలుచోట్ల భారీ వృక్షాలు నేలకూలాయి. భారీ వర్షం కురవడంతో ధాన్యం తడిసి ముద్దయింది. మామిడి కాయలు రాలిపోయాయి. అరటి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

అపార పంట నష్టం

జిల్లాలో ఇప్పటికే రబీ ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయి రైతులు కొన్ని రోజుల నుంచి ఆరబెట్టుకున్న ధాన్యం ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో బరకాలు వేసి రక్షించుకుంటున్నారు. ఆదివారం ఉదయం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలకు బరకాలు ఎగిరిపోయి ధాన్యం తడిసి ముద్ద యింది. నిడమర్రు, ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు మండలాల్లో ఈ పరిస్థితులు ఎక్కువగా కనిపించాయి. నూజివీడు, ముసునూరు, ద్వారకాతిరుమల ప్రాంతాల్లో మామిడితోటలకు నష్టం వాటిల్లింది. ముసునూరు, పెదవేగి మండలాల్లో అరటి తోటలు ఈదురు గాలుల కారణంగా పడిపోయాయి. భారీగా వీచిన ఈదురుగాలులకు జిల్లాలో 30 హెకార్టలో కోతకు వచ్చిన వరి పంటకు నష్టం వాటి ల్లిందని, రహదారులు పై ఇతర ప్రాంతాల్లో ఆరబోసిన 440 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిచినట్టు ప్రాథమిక అంచనా వేసినట్ల వ్యవసాయ శాఖ జేడీ హబీబ్‌బాషా తెలిపారు.



ద్వారకాతిరుమల మండలం సత్తెన్నగూడెంలో నేలరాలిన మామిడి కాయలను ఒబ్బిడి చేస్తున్న రైతులు

నేడు పాలగూడెంలో వైఎస్ షర్మిల పర్యటన

ఏలూరు కార్పొరేషన్ : రైతు సమస్యలు తెలుసుకునేందుకు ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలారెడ్డి సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఏలూరు మండలం పాలగూడెంలో పర్యటించనున్నట్టు కాంగ్రెస్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు తెలిపారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలోని రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుంటారని, అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను, తడిచిన ధాన్యం కల్లాలను పరిశీలిస్తారన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు..



బుట్టాయగూడెం మండలం లంకపాకల గ్రామంలో విరిగిన విద్యుత్ స్తంభం

ఈదురుగాలులు బీభత్సంతో విద్యుత్ స్తంభాలపై భారీ చెట్లు నేలకూలటంతో జిల్లాలోని చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రహదారులకు అడ్డంగా భారీ వృక్షాలు పడిన చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. జిల్లాలో విద్యుత్ శాఖ అధికారుల నివేదికల ప్రకారం 56 విద్యుత్ సబ్ స్టేషన్లలోని విద్యుత్ పీడర్లు ట్రిప్ అయ్యాయి. యుద్ధ ప్రాతిపదికన ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్లలోని 33/11 కేవీ ఫీడర్లకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు ఏఈఈఈ సీడీసీఎల్ ఉన్నతాధికారులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం వరకు విద్యుత్ పునరుద్ధరణ జరగలేదు. భారీ వృక్షాలు నేలకొరగడంతో ఏలూరు నగరంతో పాటు భీమడోలు మండలం గుండుగొలను, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు, తదితర ప్రాంతాలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

జిల్లాలో వర్షపాతం వివరాలు..

జిల్లాలో ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కురిసిన వర్షపాతం పరిశీలిస్తే జిల్లాలో అత్యధికంగా ముసునూరు మండలంలో 66.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 25.4 మిల్లీమీటర్లుగా నమోదు అయింది. లింగపాలెం 55.2, ముదినేపల్లి 48.6, చాట్రాయి 46.2, మండవల్లి 42.2, జంగారెడ్డిగూడెం 39.6, పోలవరం 38.8, నూజివీడు 33.2 బుట్టాయిగూడెం 33.2, చింతలపూడి 32, నిడమర్రు 31.4, ఉంగుటూరు 30.2, ఆగిరిపల్లి 25.6, కైకలూరు 22.6, టి.నరసాపురం 22.4, పెదపాడు 17.4, కామవరపుకోట 16.8, జీలుగుమిల్లి 15, భీమడోలు 12.8, ఏలూరు అర్బన్ 12.4 దెందులూరు 12.2, ద్వారకాతిరుమల 10, వేలేరుపాడు, 9.6, పెదవేగి 8.6, ఏలూరు రూరల్ 8.2, కుక్కునూరు 6.2, కొయ్యలగూడెం 6.8 మి.మీ నమోదయింది.

ఎటువంటి అసౌకర్యం కలుగకూడదు : కలెక్టర్



పెదవేగిలో జోరుగా కురుస్తున్న వాన

భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రి సెల్వి అధికారులకు ఆదేశించారు. జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖల జిల్లా అధికారులు , తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జన జీవనం స్తంభించకుండా జిల్లా యంత్రాంగం సమ న్వయంతో పనిచేయాలన్నారు. భారీవర్షాలు, ఈదురు గాలులు కారణంగా చాలా ప్రదేశాల్లో చెట్లు, విద్యుత్ స్థంభాలు నేలకూలి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని, అధికారులు యుద్ధప్రాతిపదికన తొలగించి రవాణాకు ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలన్నారు. చెరువులు, కాల్వలుకు గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం తడిచిపోకుండా ఉండేలా రైతులకు టార్పాలిన్లు అందించాలన్నారు. అవసరమైన ప్రదేశాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలందించాలన్నారు. భారీ వర్షాల కారణంగా ఎక్కడైనా పశునష్టం జరిగితే వెంటనే తగు నివేదిక అందించాలన్నారు.

తడిచిన ధాన్యాన్ని పరిశీలించిన జేసీ

ఉంగుటూరు/ దెందులూరు/భీమడోలు, మే 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రైతుల విజ్ఞప్తి మేరకు ధాన్యం సేకరణ లక్ష్యాన్ని 2.50 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచినట్టు జేసీ ధాత్రిరెడ్డి తెలిపారు. ఉంగుటూరు మండలం గోపీనాథపట్నం రైతు సేవా కేంద్రం వద్ద వర్షానికి తడిచిన ధాన్యం బస్తాలను ఆదివారం పరిశీలించారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని సంబంధిత రైతు సేవా కేంద్రంలో ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. పెంచిన లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణకు 11.25 లక్షల గోనె సంచులు అవసరం కాగా ప్రస్తుతం 8,95,410 గోనె సంచులు అందుబాటులో ఉన్నాయన్నారు. దెందులూరు మండలం కొవ్వలి పరిధిలో, భీమడోలు మండలం పోలసానపల్లిలో రోడ్లపై ఆరబెట్టిన, నిల్వ ఉంచిన ధాన్యాన్ని జేసీ పరిశీలించారు. వరి రైతులకు ఇబ్బందులు లేకుండా టార్గెట్‌తో సంబంధం లేకుండా ధాన్యం ప్రతి గింజను కొనుగోలు చేయాలని, మండలంలో మరో 25 టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఆమె వెంట పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ వి.శివరామమూర్తి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ బాషా, జిల్లా సహకార అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ పాలపర్తిరవి కుమార్, గోదావరి కాల్వ నీటి సంఘం అధ్యక్షులు (డీసీ) చైర్మన్ వెలమాటి రాంబాబు, తహసీల్దార్ సుమతి, వ్యవసాయశాఖ ఏడీ సుబ్బారావు, ఈఏ దామర్ల వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాల అధికారి భాను ప్రసాద్ రెడ్డి ఉన్నారు.



కొవ్వలిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

పల్లె పండుగ.. బిల్లులెక్కడ?

- పనుల బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం
- నెలలు గడుస్తున్నా అందని సొమ్ములు
- కాంట్రాక్టర్లు లబోదిబో.. కొన్నిచోట్ల ఆగిన పనులు



ఏలూరు మండలం కాట్లంపూడిలో నిర్మించిన గోకులం షెడ్

ఏలూరు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం గ్రామాలలో పల్లె పండుగ పేరుతో పెద్ద ఎత్తున సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు, రైతులకు గోకులం షెడ్లను నిర్మించింది. అధికారులు పనులు చేసిన వెంటనే వారం వారం బిల్లులు చెల్లిస్తామని చెప్పడంతో గ్రామాల్లో టీడీపీ నేతలు, కాంట్రాక్టర్లు లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి, శరవేగంగా పనులు చేపట్టారు. పనులు చేసి నెలలు అవుతున్నా నేటికీ బిల్లులు చెల్లించలేదు. దీంతో వారంతా లబోదిబోమంటున్నారు. కొన్ని పనులు బిల్లులు కాక ముందుకు సాగడం లేదు. ప్రతీ శుక్రవారం బిల్లులు అవుతాయని చెప్పినా వారాలు మారుతున్నాయే గాని బిల్లులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలోని పంచాయతీలకు ప్రభుత్వం గతేడాది అక్టోబరులో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలు చేపట్టేందుకు మొత్తం 38 పనులకు సుమారు రూ.4 కోట్లు నిధులను ఉపాధి పథకంలో కింద మంజూరు చేసింది. నవంబరులో వేసిన రోడ్లకు ఇంత వరకు బిల్లులు చెల్లించలేదు. పనులు చేసిన వారు తీవ్ర నైరాశ్యంలో ఉన్నారు. తాము పనులు చేసిన వెంటనే క్వాలిటీ అధికారులు బృందం వచ్చి తనిఖీలు చేసిందని, అయినా బిల్లులు రావడం వాపోతున్నారు.

పాడి రైతులకు 17 గోకులం షెడ్లు మంజూరు కాగా, కొందరు రైతులు పెట్టుబడులు పెట్టి పూర్తిశాతం పనులు చేశారు. వాటికి ఇంతవరకు బిల్లులు రాలేదు. ప్రధానంగా జిల్లాలో 212.75 కిలోమీటర్ల మేర 990 సీసీ రోడ్లు పనులు చేపట్టారు. రూ.29 లక్షలతో మూడు చోట్ల కాంపౌండ్ వాల్స్ ఏర్పాటు, పశువులు, గొర్రెలు, మేకల షెడ్లకు సంబంధించి 842 పనులను చేపట్టారు. అయితే సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో చాలా గ్రామాల్లో పనులు నిలిచిపోయాయి. జిల్లాలో పల్లె పండుగ పనులకు ప్రభుత్వం సుమారు రూ.120 కోట్లు కేటాయించింది. ఇంకా కాంట్రాక్టర్లకు సుమారు రూ.60 కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉండడం తో పనులు ముందుకు సాగడం లేదు. బకాయిలు చెల్లిస్తే పనులు చేస్తామని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు.

ఈసెట్, ఐసెట్‌లకు ఏర్పాట్లు పూర్తి

లోపలి పేజీలో..



ట్రబుల్ ఐటీ!

నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో వేధిస్తున్న మౌలిక వసతుల లేమి

- విద్యార్థులకు అందని ల్యాప్‌టాప్‌లు, యూనిఫాం
- రివర్స్ టెండరింగ్‌తో దెబ్బతింటున్న భోజన నాణ్యత
- రానున్న విద్యాసంవత్సరానికి సమస్యల స్వాగతం

నూజివీడు టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో విద్యాభ్యాసం పేరుగొప్ప ఊరుదిబ్బ అన్నట్టుగా ఉందని విమర్శలు విన్పిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రస్తుతం విద్యార్థులకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలు కొరత వేధిస్తోంది. ఈ పరిస్థితుల్లో నూతన విద్యాసంవత్సరం ప్రారంభానికి యూనివర్సిటీ నోటిఫికేషన్‌ను సైతం విడుదల చేసింది. రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో నూజివీడు, ఆర్కేవ్యాలీ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ విద్యా విధానంలో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 2008లో జీవో నంబరు 18 ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నూజివీడు, ఆర్కేవ్యాలీలలో ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేశారు. అనంతరం నవ్యాంధ్ర లో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేయగా, ఒక్కో క్యాంపస్‌లోనూ 6,600 మంది విద్యార్థుల వరకు విద్యనభ్యసిస్తున్నారు. అయితే వీరికి ప్రతి రెండేళ్లకు ఒకసారి యూనిఫాం, లెర్నింగ్ బై డూయింగ్ విద్యా విధానం అమల్లో భాగంగా ల్యాప్‌టాప్‌లను అందించాల్సి ఉంది. కాని గత వైసీపీ ప్రభుత్వంలో యూనిఫాం అందించడంలో, ల్యాప్‌టాప్‌ల కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో మూలనపడడానికి సిద్ధంగా ఉన్న ల్యాప్‌టాప్‌ల తోనూ విద్యాసంవత్సరాన్ని నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. గత విద్యాసంవత్సరానికి ముందే ఈ పరిస్థితులు ఉండగా 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాల నేపథ్యంలో పాక్షికంగా యూనిఫాం, ల్యాప్‌టాప్‌లను అందించారు. క్యాంపస్‌లో పీయూసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు యూనిఫాంను అందించగా ప్రథమ - మిగతా 8లో

ట్రిపుల్ ఐటీలకు 17,256 దరఖాస్తులు

రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు సంబంధించి ఆదివారం నాటికి 17,256 దరఖాస్తులు దాఖలైనట్లు ఆర్జీయూకేటీ రిజిస్టర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, శ్రీకాకుళం, ఆర్కేవ్యాలీ, ఒంగోలు క్యాంపస్‌లలో ప్రతి క్యాంపస్‌లో వెయ్యి సీట్లకు అదనంగా మరో 100 సూపర్ న్యూమరరీ సీట్లకుగాను ఏప్రిల్ 27వ తేదీ నుంచి దరఖాస్తులను యూనివర్సిటీ స్వీకరిస్తోంది. ఈనెల 20వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో మెరిట్ విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో దాఖలు చేయవచ్చని ఆయన తెలిపారు.

నీట్ ప్రశాంతం



ఉమ్మడి పశ్చిమ జిల్లాలో నీట్-యూజీ పరీక్ష పటిష్ఠ బందోబస్తు నడుమ ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఏలూరులో మూడు కేంద్రాలు, గోపన్నపాలెంలో మరో రెండు కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు మొత్తం 1200 మంది విద్యార్థులు దరఖాస్తుచేసుకోగా, వీరిలో 1162 మంది హాజరయ్యారు. (చిత్రంలో) ఏలూరులోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థినులను తనిఖీ చేస్తున్న సిబ్బంది.

లోపలి పేజీలో..

ఈసెట్, ఐసెట్‌లకు ఏర్పాట్లు పూర్తి

» ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని పది కాలేజీల్లో పరీక్ష కేంద్రాలు

ఏలూరు అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : పలు కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 6, 7 తేదీల్లో నిర్వహించనున్న ఈసెట్, ఏపీఐసెట్ పరీక్షలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సంఖ్య ఖరారైంది. ఇంజనీరింగ్ రెండో ఏడాదిలో ప్రవేశాలకు నిర్వహించే ఏపీఈసెట్ పరీక్ష ఈనెల 6న ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు షిఫ్టుల్లో జరుగుతుంది. ఈ పరీక్షకు మొత్తం 2,345 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఏలూరు సిద్దార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ స్కూలు, సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, భీమవరం డీఎన్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, దంతులూరి నారాయణరాజు అటానమస్ కళాశాల, విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, శ్రీ విష్ణు మహిళా ఇంజనీరింగ్ కళాశాల, నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాల, తాడేపల్లిగూడెం శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాల, శశి ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏపీ ఈసెట్ పరీక్ష జరుగుతుంది. ఈ కళాశాలల్లో ఉదయం షిఫ్టులో జరిగే పరీక్షకు 1,443 మంది, మధ్యాహ్నం షిఫ్టు పరీక్షకు 902 మంది అభ్యర్థులను కేటాయించారు.

7న ఇవే కళాశాలల్లో ఏపీఐసెట్ పరీక్ష

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఐసెట్ పరీక్ష ఈనెల 7న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా మొత్తం పది కేంద్రాల్లో జరుగుతుంది. ఏపీఈసెట్‌కు ఉమ్మడి జిల్లాలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాల్లోనే ఐసెట్‌కు ఎంపిక చేశారు. ఈ పరీక్ష ఉదయం 9 నుంచి 11.30గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు రెండు షిఫ్టుల్లో నిర్వహిస్తారు. ఉదయం షిఫ్టు పరీక్షకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,477మంది, మధ్యాహ్నం షిఫ్టు పరీక్షకు 1,479మంది అభర్థులు కలిపి మొత్తం 2956మంది దరఖాస్తు చేసుకున్నారు. హాల్ టిక్కెట్‌తోపాటు ఏదైనా ఫొటో గుర్తింపుకార్డుతో అభ్యర్థులు హాజరుకావాలి. పరీక్ష ప్రారంభ సమయం తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు.

భక్తి విలువలు తెలిపేలా 'అనంతాళ్వార్' సినిమా

» జూన్‌లో ద్వారకాతిరుమలలో ప్రారంభిస్తాం : సినీ నటుడు బాలాజీ



శ్రీవారి ఆలయంలో సినీ నటుడు బాలాజీ

ద్వారకాతిరుమల, మే 4 (ఆంధ్రజ్యోతి): నేటి యువతరానికి భక్తివిలువను తెలియజెప్పేలా తాను నిర్మించనున్న భక్తాగ్రేశ్వరుడు అనంతాళ్వార్ సినిమాకు ఏ అవరోధాలు లేకుండా చూడాలని కోరేందుకు శ్రీవారి సన్నిధికి వచ్చామని ప్రముఖ సినీనటుడు, క్యారెక్టర్ ఆర్టిస్ట్ బాలాజీ తెలిపారు. ఆదివారం చినవెంకన్న ఆలయాన్ని ఆయన సందర్శించి పూజలు చేశారు. దర్శనానంతరం ఆయనను పలువురు అభిమానులు గుర్తించి ఫొటోలు దిగారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అనంతాళ్వార్ సినిమాను జూన్‌లో ద్వారకాతిరుమల శ్రీవారిసన్నిధిలో ప్రారంభిస్తానన్నారు. స్వామికి నిత్యం పూలమాలలు సమర్పించే అనంతాళ్వార్ ఆ స్వామివారి మీదకి గునపాన్ని విసిరారని ఆ గునపం ఇప్పటికీ తిరుమల మహాద్వారం దాటిన తర్వాత కుడివైపున గోడకు వేలాడుతూ ఉంటుందన్నారు. ఆ గునపం స్వామి మీదకు ఎందుకు విసిరారో నేటియువతరం తెలుసు కోవాలని, ఈ సినిమా ద్వారా భక్తి విలువలు చాటిచెప్పాలని ఉందని తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న వీహెచ్‌పీ నాయకుడు అలోక్‌కుమార్

పాకిస్థాన్ ఉగ్రమూలాలను ఏరివేయాలి

» విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు అలోక్‌కుమార్

భీమవరం క్రైం, మే 4(ఆంధ్రజ్యోతి) : పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్రవాద స్థావరాలతోసహా జిహాది ఉగ్రవాదాన్ని నిర్మూలించి ఉగ్రమూలాలను ఏరివేయాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) పిలుపునిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది అలోక్‌కుమార్ అన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆదివారం భీమవరం అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద తయారీ కేంద్రాలు, నిరంతర ఉగ్రవాద చర్యలను తుదముట్టించాలని వీహెచ్‌పీ పిలుపునిస్తుందన్నారు. ఘర్ వాపసీ ఉద్యమాలు, ప్రభుత్వ నియంత్రణ నుంచి దేవాలయాల విముక్తి, మత మార్పిడిలను ఆపడంతోపాటు అవసరమైన వారికి సేవా కార్యక్రమాలను పెంచుతామన్నారు. పహల్గామ్ దాడిలో జిహాది ఉగ్రవాద చర్య తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అటువంటి ఘోరమైన చర్యలకు మద్దతు, శిక్షణ ఇస్తున్న పాకిస్థాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ కేంద్రీయ ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, పరిషత్ ప్రాంతీయ అధ్యక్షుడు వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు మాట్లాడారు. పరిషత్ ప్రాంతీయ ఉపాధ్యక్షుడు రుద్రరాజు వేణుగోపాలరాజు అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, వీహెచ్‌పీ ప్రాంతీయ కార్యదర్శి భూపతిరాజు సుబ్బరాజు, నడింపల్లి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



శ్రీవారి ఆలయ అనివేటి మండప ప్రాంతంలో భక్తులు

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, మే 4(ఆంధ్రజ్యోతి): గోవింద నామస్మరణలతో చినవెంకన్న క్షేత్రం మార్మోగింది. ఆదివారం, సప్తమి తిథి మంచిది కావడంతో శ్రీవారి ఆలయం భక్తజనులతో రద్దీగా ఉంది. ఆలయంలోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, ద్విచక్రవాహనాలతో నిండింది. సుమారు 12 వేల మంది వరకు భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



గుబ్బల మంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

గుబ్బల మంగమ్మ సన్నిధిలో భక్తుల సందడి

బుట్టాయగూడెం, మే 4(ఆంధ్రజ్యోతి) : పశ్చిమ మన్యంలో ఉన్న వనదేవత గుబ్బల మంగమ్మను దర్శించుకోడానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుంచే భక్తులు అమ్మవారి దర్శనాలకు క్యూ కట్టారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో సందడి ఉంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఉదయం ఏజెన్సీలో వర్షం కురిసినా అమ్మవారి దర్శనాలకు ఎటువంటి ఆటంకాలు కలగలేదు. భక్తుల సౌకర్యం కోసం ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు.



చేతుల పరిశుభ్రతే ఆరోగ్యానికి రక్ష

● పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

నేడు ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం

పరిశుభ్రమైన చేతులు ఆరోగ్యానికి చిహ్నాలు.. చేతుల పరిశుభ్రం ద్వారానే మనం ఎటువంటి రోగాలకు గురికాకుండా ఉండొచ్చని ప్రపంచ వ్యాప్తంగా వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. మనం తీసుకునే ఆహారంతోనే రోగ కారక క్రిములు మన శరీరంలోకి ప్రవేశిస్తాయని తద్వారా జ్వరం, డయేరియా అజీర్తి మొదలగు రోగాలు మన శరీరంలోకి ప్రవేశించి అనారోగ్యానికి గురిచేస్తున్నాయి. అందుకే ప్రజలు ప్రతినిత్యం చేతుల పరిశుభ్రంగా ఉంచుకుని రోగాలకు దూరంగా ఉండాలి. మే 5న ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

నిడమర్రు, మే 4(ఆంధ్రజ్యోతి) : ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం పురస్కరించుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడం కోసం ప్రతిరోజు చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలన్న విషయం ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాం. చేతుల పరిశుభ్రతకు ఆరోగ్యానికి ఉన్న సంబంధంపై చాలా ఏళ్ల క్రిందటే వైద్యనిపుణులు గుర్తించారు. 1940లో వియత్నాం దేశంలో వియన్నా జనరల్ హాస్పిటల్ వైద్యాధికారి ఇగ్నాల్ సెమ్మెల్‌వీస్ మధ్యాహ్న భోజన సమయంలో పిల్లలు చేతులు కడుక్కోకపోవడం వల్లే అతిసారం వ్యాధికి తీవ్రంగా గురవుతున్నారని పరిశోధనల ద్వారా నిర్ధారించి దీనిపై అవగాహన కార్యక్రమాలు ఆ దేశంలో నిర్వహించారు.. అందుకే ఇగ్నాజ్ సెమ్మెల్‌వీస్‌ను పరిశుభ్రత పితామహుడుగా పిలుస్తారు. కొంతకాలం తర్వాత ఇటలీలో క్రిమియన్ యుద్ధంతో ఫ్లోరెన్స్ నైటింగేల్ తమ వైద్య విధానంలో చేతుల పరిశుభ్రతపై ప్రత్యేక పద్ధతులు అవలంబించి రోగాల వ్యాప్తికి అడ్డుకట్టు వేశారు. 2008లో ఐక్యరాజ్యసమితి ప్రపంచ చేతులు పరిశుభ్రత దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించి ప్రజలలో అవగాహన కోసం అనేక అవేర్‌నెస్ కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

చేతుల పరిశుభ్రత అలవాటు చేయాలి



ప్రపంచ వ్యాప్తంగా శాస్త్ర వేత్తలు చేతుల పరిశుభ్రతపై చేసిన పరిశోధనలో చేతుల ద్వారానే 90 శాతం క్రిములు శరీరంలోకి ప్రవేశిస్తాయని నిరూపితమైంది. పాఠశాల స్థాయినుంచే విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత తెలియజేస్తూ చేతుల పరిశుభ్రత అలవాటు చేయాలి.

– డాక్టర్ నూకల మహీధర్, ఎం.ఎస్ తాడేపల్లిగూడెం

మన చేతులు మన భవిష్యత్తు..

చిన్నారులకు తమ పాఠశాల వయస్సు నుంచే చేతుల పరిశుభ్రతపై అవగాహన పెంచడం కోసం ఐక్యరాజ్య సమితి ప్రపంచవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో చేతులు పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. తల్లిదండ్రులు తమ చిన్నారులకు చేతులు పరిశుభ్రంగా కడుక్కోవడాన్ని పోత్సహించాలి. అలాగే పాఠశాలలో ఉపాధ్యాయులు చేతుల పరిశుభ్రంపై అవగాహన కల్పించాలి.

పోషకాహారంతో రోగాలు దూరం..

మనం తీసుకొనే ఆహారంతోనే మనకు రోగాలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. తీసుకునే ఆహారం పరిశుభ్రమైనప్పుడు రోగాల నుంచి దాదాపుగా దూరంగా ఉండొచ్చని తద్వారా ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుంది. 90శాతం రోగాలు ఆహారం తీసుకునే ముందు మన చేతులు కడుక్కోకపోవడం ద్వారా వ్యాప్తిస్తాయి. బ్యాక్టీరియా, వైరస్‌లు చేతుల ద్వారా మన ఆహారంతోపాటు జీర్ణాశయంలో ప్రవేశించి అనేక రోగాలకు కారణమవుతున్నాయి. చేతులు పరిశుభ్రత ద్వారా పిల్లలలో 20 నుంచి 40 శాతం డయేరియా రోగాలు తగ్గుముఖం పట్టాయి. 58 శాతం మందిలో డయేరియా వ్యాధికారక క్రిములు నిర్మూలించబడ్డాయి. 20శాతం మందిలో శ్వాసకోస రోగాల వ్యాప్తి నివారించబడిందని పరిశోధనలు నిర్ధారించాయి.

చేతులు శుభ్రత ఎప్పుడంటే..

ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో చేతులు ఎప్పుడు కడుక్కోవాలో పరిశోధనలతో కొన్ని సందర్భాలు ప్రత్యేకంగా పేర్కొన్నారు.

- మల విసర్జన తర్వాత.
- మూత్ర విసర్జన తరువాత.
- భోజనాలు తయారు చేసేముందు.
- భోజనం తినేముందు, తరువాత..
- దగ్గు దగ్గిన తరువాత.
- ముక్కు చీదిన తరువాత.
- చేతులు మురికిగా ఉన్నప్పుడు.
- జంతువులను తాకిన తర్వాత.
- పేడ వంటి జంతువుల మలమూత్రాలను తాకిన తర్వాత



చేతులు పరిశుభ్రత ఇలా..

చేతులు పరిశుభ్రత సంపూర్ణంగా చేయడం కోసం వైద్య నిపుణులు కొన్ని ప్రత్యేక పద్ధతులను సూచించారు. ప్రతిఒక్కరూ చేతులను నీళ్ల, సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. రోగాల నివారణకు ఇది అత్యుత్తమ, అత్యంత చౌక మార్గంగా నిర్ధారించబడింది.

- ముందుగా చేతులను నీళ్లతో తడి చేసుకోవాలి
- తర్వాత సోప్‌తో గానీ, హ్యాండ్ వాషింగ్ లిక్విడ్‌ను కొంతచేతిలో తీసుకొని నురుగు వచ్చేవరకు రుద్దాలి.
- సబ్బు నరుగతో అరచేయిలో మరో అరచేయి వేసి రుద్దాలి. చేతి వేళ్ల సందుల్లో వేళ్లు వేసి రుద్దుకోవాలి
- చేతుల గోళ్ల వద్ద ప్రత్యేకంగా సబ్బుతో రుద్దుకోవాలి
- చేతుల ఉపరితలం మీద సబ్బుతో మణికట్టువరకు రుద్దుకోవాలి.
- నడుస్తున్న నీటితో చేతులు శుభ్రం చేసుకోవాలి.
- పొడి గుడ్డతో లేదా సింగిల్ యూజ్ పేపర్ (టిష్యూ పేపర్)తో తుడుచుకోవాలి.

ఈ పక్రియ సుమారు 20-30 సెకన్లు పాటు తప్పనిసరిగా నిర్వహిస్తే మన చేతిలో క్రిముల 95 శాతం వరకు నిర్మూలించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

నీట్ ప్రశాంతం

» ఏలూరు జిల్లాలో 1,162 మంది, తాడేపల్లిగూడెంలో 1,847 మంది హాజరు

» పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్‌లతో నిఘా



తాడేపల్లిగూడెం నిట్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

ఏలూరు అర్బన్/తాడేపల్లిగూడెం రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్-యూజీ పరీక్ష పటిష్ట బందోబస్త్ నడుమ ఆదివారం ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఏలూరు జిల్లా ఏలూరులో మూడు కేంద్రాలు, గోపన్నపాలెంలో మరో రెండు కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు మొత్తం 1,200 మంది విద్యార్థులు దరఖాస్తుచేసుకోగా, వీరిలో 1,162మంది హాజరయ్యారు. ఏలూరు సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలు కేంద్రానికి 240 మందికి 234మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు 240మందికి 232, కస్తూరిబా బాలికోన్నత పాఠశాలకు 360మందికి 347, గోపన్నపాలెం కేంద్రీయ విద్యాలయకు 240మందికి 235, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 120మందికి 114మంది హాజరయ్యారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు నమోదుకాలేదని నీట్-యూజీ సిటీ కో-ఆర్డినేటర్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ బి.ఎస్.మీనా తెలిపారు. పరీక్ష ముగిసిన అనంతరం జవాబు పత్రాలను గోపన్నపాలెంలోని కేంద్రీయ విద్యాలయకు చేర్చి, ప్యాక్ చేసి సీల్ వేసిన అనంతరం సాయుధ పోలీసు బందోబస్తు నడుమ స్పీడ్‌పోస్టులో తరలించారు. పరీక్ష కేంద్రాలను డీఆర్వో, ఏలూరు డీఎస్పీ, డీఈవో, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్, తదితరులు సందర్శించారు. నీట్-యూజీకి జిల్లా నోడల్ అధికారిగా కలెక్టర్ వెట్రిసెల్వి వ్యవహరించారు. జిల్లాలోని ఐదు కేంద్రాల వద్ద జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ పర్యవేక్షణలో పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.



తాడేపల్లిగూడెం నిట్ వద్ద హాల్‌టికెట్‌లు పరిశీలిస్తున్న సిబ్బంది

- పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఏపీ నిట్, శశి ఇంజనీరింగ్ కళాశాలల వద్ద ఏర్పాటు చేసిన నాలుగు సెంటర్లలో 1,886 మంది విద్యార్థులకు గాను 1,847 మంది పరీక్షలు రాశారు. మూడంచెల తనిఖీలతో విద్యార్థులను తనిఖీ చేస్తూ పరీక్ష కేంద్రాలకు ఉదయం 11 గంటల నుంచే అనుమతించారు. పరీక్షల సరళిని కలెక్టర్ చదలవాడ నాగరాణి పరిశీలించారు.
- ఈదురుగాలులతో కూడిన వర్షం ఆదివారం ఉదయం కురవడంతో పరీక్షకు ఆటంకం ఏర్పడుతుందేమోనన్న భయాందోళన వ్యక్తమైంది. పది గంటల నుంచే వర్షం తగ్గుముఖం పట్టడంతో పరీక్షలు ప్రశాంతంగా రాశారు. పరీక్ష ప్రారంభ సమయానికి అరగంట ముందే గేటు క్లోజ్ చేస్తామని ప్రభుత్వం విస్తృత ప్రచారంచేయడంతో ఆమేరకు అభ్యర్థులు ఉదయం పదకొండు గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులు చేతి రింగ్‌లు, వాచీలు, ఫోన్‌లతోపాటు చెవి రింగులు లేకుండానే పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు. అభ్యర్థుల నుంచి బయోమెట్రిక్ హాజరుతీసుకున్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో ప్రాంగణాల్లో నిశిత నిఘా సాయంత్రం ఐదు గంటలవరకు కొనసాగింది. పరీక్ష కేంద్రాల పరిధిలో సెల్‌ఫోన్లు పనిచేయకుండా జామర్లను ఏర్పాటు చేశారు.



ఏలూరులో తనిఖీలు చేసి పరీక్ష హాలులోకి పంపిస్తున్న అధికారులు, పోలీసులు



క్రైమ్ కార్నర్

వివాహిత ఆత్మహత్య



పుష్ప మృతదేహం

ఏలూరు క్రైం, మే 4 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వివాహిత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఏలూరు చాణుక్యపురి కాలనీ రెండో రోడ్డునకు చెందిన ముప్పన పుష్ప (40)కు భర్త హనుమంతరావు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతడు ఒక షాపులో గుమస్తాగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆమె గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతుండడంతో వైద్యం చేయిస్తున్నారు. శనివారం రాత్రి కుటుంబ సభ్యులంతా యథావిధిగా నిద్రించారు. తెల్లవారేసరికి ఆమె ఉరివేసుకుని ఉంది. ఆమెను ఉరి నుంచి దించి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించారు. అనారోగ్య కారణం వల్ల ఆమె జీవితంపై విరక్తి చెందిన ఉరి వేసుకున్నట్లుగా గుర్తించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

స్నేహితుడి దగ్గరకు వెళుతూ..

» పాల వ్యాన్‌ను ఢీకొట్టిన మోటారు సైకిల్ ఒకరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

పెదవేగి, మే 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం ఒకరి ప్రాణం తీయగా, మరొకరిని తీవ్రంగా గాయపర్చింది. పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలివి.. బిహార్ రాష్ట్రం పాట్నాకు చెందిన చందన్, మనోజ్ పెదవేగి మండలం కొప్పులవారిగూడెంలో ఓ రైతు దగ్గర మూడు నెలలుగా పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి రైతు దగ్గర జీతం సొమ్ము తీసుకుని రాత్రి తొమ్మిది గంటల సమయంలో కొప్పులవారిగూడెం నుంచి వేగివాడలోని స్నేహితుని దగ్గరకు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ముండూరు గ్రామం చివర చికెన్ షాపు సెంటర్ దగ్గర ఎదురుగా వస్తున్న పాల వ్యానును వేగంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం పాలవ్యాన్ ముందు చక్రాల కింద ఇరుక్కుపోవడంతో చందన్(25) అక్కడికక్కడే మృతిచెందాడు. మనోజ్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుని ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

» ఇద్దరికి తీవ్ర గాయాలు

» క్షతగాత్రులకు అండగా నిలిచిన మంత్రి నాదెండ్ల మనోహర్



క్షతగాత్రుడిని పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల

ద్వారకాతిరుమల, మే 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మండలంలోని ఎం.నాగులపల్లి అడ్డరోడ్డు వద్ద ఇన్నోవా కారు, పక్కనే వెళ్తున్న బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. అదే సమయంలో విజయవాడ నుంచి కాకినాడకు వెళ్తూ రోడ్డు ప్రమాదాన్ని చూసిన మంత్రి నాదెండ్ల మనోహర్ కారు ఆపి గాయపడిన వ్యక్తులకు సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. పెదవేగి మండలం చక్రాయిగూడెంకు చెందిన దొంగల రాజకుమార్, రామకృష్ణ బైక్‌పై ఆదివారం రాజమహేంద్రవరం వైపు వెళ్తున్నారు. పక్కనే వెళ్తున్న కారు వీరిని ఢీకొట్టడంతో వారిరువురూ తీవ్రగాయాల పాలయ్యారు. రోడ్డుపై పడిఉన్న క్షతగాత్రులను చూసి చలించిన మంత్రి వెంటనే తాను ప్రయాణిస్తున్న కారు ఆపి హైవే పెట్రోలింగ్ పోలీసులను, అంబు లెన్స్‌ను పిలిపించారు. పెట్రోలింగ్ పోలీసు లు వచ్చి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిం చారు. మంత్రి తన కాన్వాయ్‌లోని ప్రొటో కాల్ వాహనాన్ని అంబులెన్స్‌కు ఎస్కార్ట్‌గా ఉపయోగించి వేగంగా ఆసుపత్రికి చేరేలా చర్యలు తీసుకున్నారు. జిల్లా ఎస్పీకి స్వ యంగా ఫోన్ చేసి గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించాలని సూచించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

పాలకోడేరు, మే 4(ఆంధ్రజ్యోతి): విస్సాకోడేరులోని వనుములమ్మ ఆలయం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. భారీవర్షం నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో ఆ గ్రామమంతా చీకటిమయంగా ఉంది. అదే సమయంలో విస్సాకోడేరు శివారు వంకాయలపాలెంకు చెందిన కురసా శ్రీనివాసరావు(50) ఇంటికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో అక్కడికక్కడే అతడు మృతి చెందాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు పాలకోడేరు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బీచ్‌లో యువకుడి గల్లంతు



పవన్ కుమార్ (ఫైల్)

మొగల్తూరు, మే4 (ఆంధ్రజ్యోతి) : పేరుపాలెం సాగర తీరానికి వచ్చి సముద్ర స్నానానికి దిగిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. మొగల్తూ రు ఎస్‌ఐ జి.వాసు తెలిపిన వివరాలివి.. యలమంచిలి మండలం అబ్బిరాజుపాలెంకు చెందిన వలవల దివ్య శ్రీరామ్ పవన్‌కుమార్ అనే యువకుడు భీమవరంలో బీటెక్ చదువుతు న్నాడు. ఆదివారం సెలవుదినం కావడంతో స్నేహితులతో కలిసి బీచ్‌కు వచ్చి సముద్ర స్నానానికి దిగిన యువకుడు సముద్ర అలల ఉధృతికి కొట్టుకుపోయాడు. పవన్ తండ్రి శ్రీరామ్మూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్టు ఎస్‌ఐ తెలిపారు.



'జడ్పీ'లో అగ్ని ప్రమాదం

» షార్ట్ సర్క్యూటే కారణమా ?

ఏలూరు క్రైం, మే 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అధికారులు తెలిపిన వివరాలివి.. జడ్పీ కార్యాలయంలోని ఏవో గదిలో ఏసీ షార్ట్‌సర్క్యూట్ కావడంతో పొగ, మంటలు వ్యాపించాయి. గది బయటే ఉన్న సిబ్బంది గుర్తించారు. సమాచారం అందుకున్న జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి రామకృష్ణ సిబ్బందితో అక్కడకు వచ్చి మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగి ఉండొచ్చని, ఏసీతో పాటు ఫైళ్లు, ముఖ్యమైన వస్తువులు తగలబడ్డాయా అనే కోణంలో పరిశీలన చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ ఘటన పలు అనుమానాలకు తావిస్తుందని కొందరు చెబుతున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిందా లేక ఇతర కారణాలున్నాయా అని అంటున్నారు.

ఉండిలో చోరీ

11 కాసుల బంగారం.. నగదు అపహరణ

ఉండి, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఉండి బాలాజీరావు పేటలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి పోలీసులు తెలిపిన వివరాలివి.. బాలాజీరావు పేటకు చెందిన శేషాద్రి వెంకట మధుసూదనరావు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈనెల మూడో తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగొలగొట్టి బీరువాలో ఉన్న 11 కాసుల బంగారం, రూ.35 వేలు నగదు తస్కరించారు. ఆదివారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

అలరించిన సంగీత నృత్యోత్సవాలు

ఏలూరు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : కళాదీపిక నృత్య అకాడమీ ఆధ్వర్యంలో ఏలూరు వైఎంహెచ్ హాల్లో రెండ్రోజులుగా జరుగుతున్న సంగీత నృత్యోత్సవాలు అలరించాయి. సభ, సత్కార కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత, కూచిపూడి నృత్యానికి విశేష సేవలు అందించిన రాధాశ్యామ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళారత్న కె.వి.సత్యానారాయణ, మధ్యాహ్నపు ఈశ్వరి బలరాం, గరికపాటి ఆర్ట్ థియేటర్స్ గరికపాటి కాళీదాసు, పెదపాటి రామకృష్ణ, సాహిత్య మండలి పుల్లాబోట్ల పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ద్వారకాతిరుమల, మే 4(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. ద్వారకాతిరుమలలోని ఆర్యవైశ్య కల్యాణ మండప ట్రస్ట్ ఏర్పడి 25 వసంతాలు పూర్తయిన సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు బొండాడ రామమోహనరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ఏపీ ఆర్యవైశ్యకార్పొరేషన్ చైర్మన్ పారేపల్లి రాజేష్(డూండి)తో కలిసి ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు.



ఎన్నికైన ఏలూరు తాలూకా యూనిట్ నూతన కార్యవర్గం

ప్రభుత్వ ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎన్నిక

ఏలూరు అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) ఏలూరు తాలూకా యూనిట్ ఎన్నికలు ఆదివారం సంఘ కార్యాలయంలో జరిగింది. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఎన్నికల పరిశీలకుడు కె.ఫణీంద్ర తెలిపారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులుగా టి.నీలిమాదేవి, ఏ.గోపికృష్ణ, కోశాధికారిగా జి.డెల్పిన్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్.నరేష్ కుమార్, సభ్యులుగా విజయశ్యామల, సుభాషిణి, మీనాకుమారిలను ఎన్నుకున్నారు.అనంతరం జరిగిన సంఘ జిల్లా సర్వసభ్య సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎం.రాము, కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఐఆర్‌ను ఇవ్వాలని, డీఏ ప్రకటించాలని, పీఆర్సీ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల అధికారులుగా శ్రీనివాసరావు, గోవిందరావు వ్యవహరించారు.

చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

లింగపాలెం, మే 4 (ఆంధ్రజ్యోతి) : ధర్మాజీగూడెం గ్రంథాలయంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో పలువురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చినట్టు గ్రంథాలయ అధికారి సి.హెచ్.వెంకటరమణ అన్నారు. వేసవి ఉచిత విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ధర్మాజీగూడెం గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.వి.నారాయణ పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో టెన్త్ టాపర్లకు సన్మానం



వాసంతిని సన్మానిస్తున్న నాయకులు

పెదవేగి, మే 4 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విజయరాయి పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అత్యధిక మార్కులు సాధించిన ఇ.వాసంతి (572)ని సత్కరించారు. యూటీఎఫ్ నాయకులు పి. వెంకటరమణ, ఎం.లక్ష్మీనారాయణ, ఎ.నాగరాజు, బి.వెంకటేశ్వరరావు, కె.నరేంద్ర, బి.రామారావు, సి.హెచ్.శ్రీనివాసరావు, డి.లింగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

చింతలపూడి, మే 4(ఆంధ్రజ్యోతి) : యండపల్లి గ్రామంలో గ్రామ స్థాయి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం జరిగింది. గ్రామ స్థాయిలోని రైతులకు ప్రకృతి వ్యవసాయ లక్ష్యాలు, పద్ధతులపై అవగాహన కల్పించారు. సమావేశంలో మండల డిజిటల్ ఫెసిలిటేటర్ మరికంటి గోపాలకృష్ణ రైతులతో మాట్లాడుతూ నవ ధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం గత మూడేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను గుర్తించి చిరు సత్కారం అందజేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ బి.నరసింహారావు, నీటి సంఘం అధ్యక్షులు వసంతరావు పాల్గొన్నారు.

వర్షంలోనూ కొనసాగిన సీహెచ్‌వోల నిరసన

ఏలూరు రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని ఏలూరు జిల్లా ఏపీఎంసీఏ అధ్యక్షుడు సొంగా సిద్ధయ్య అన్నారు. కలెక్టరేట్ వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన నిరసన ఆదివారం 7వ రోజుకు చేరింది. జోరు వర్షంలోనూ ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న తమకు ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సురేంద్ర, చాందిని, విమల పాల్గొన్నారు.

20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం

ఏలూరు కార్పొరేషన్, మే 4(ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు కె.వి.రమణ పిలుపునిచ్చారు. ఆదివారం సంఘ కార్యాలయంలో ఆఫీస్ బేరర్ల సమావేశాన్ని నిర్వహించారు. కార్మిక వర్గానికి చెందిన ప్రతినిధులంతా సార్వత్రిక సమ్మెలో పాల్గొనేలా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్.రామ్మోహన్, బద్దా వెంకట్రావు, ఈమని కృష్ణకుమార్ ఉన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరుకార్పొరేషన్, మే 4(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు.ఆదివారం అన్నే భవనంలో ఈ నెల 20న ఉపాధి పనులు బంద్ చేసే కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్స్‌ను ఆవిష్కరించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 15 రోజులకొకసారి వేతనాలు, పే స్లిప్‌లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ అధ్యక్షులు ఎం.జీవరత్నం, ఎ.రవి, తామా ముత్యాలమ్మ, జి.వెంకట్రావు, కారం నాగదుర్గ, ఎ.ప్రభాకర్, వై.సీత, ఎస్.సాయికృష్ణ, ఎం.చలపతి పాల్గొన్నారు.

ట్రబుల్ ఐటీ!

(ఐదో పేజీ తరువాయి)

సంవత్సరం విద్యార్థులకు విద్యాసంవత్సరం పూర్తి కావొస్తున్నా అందించలేదు. మరోవైపు విద్యార్థినులు తమకు కనీసం రెండేళ్లకు ఒక జత యూనిఫాం ఇవ్వాల్సిందిగా పలుమార్లు యూనివర్సిటీ అధికారులకు మొరపెట్టుకున్నా అది ఆచరణలోకి రాలేదు. ఈ నేపథ్యంలో అసౌకర్యాల నడుమ విద్యార్థులు విద్యాసంవత్సరాన్ని పూర్తి చేయగా, ఇటీవల నూతన విద్యాసంవత్సరం ప్రారంభానికి నోటిఫికేషన్‌ను యూనివర్సిటీ విడుదల చేసింది. నూతన విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు అవసరమైన ల్యాప్‌టాప్‌లను, యూనిఫాం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో గత ప్రభుత్వ నిర్లక్ష్య విధానాలను టీడీపీ ప్రభుత్వం సరిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రివర్స్ టెండరింగ్‌తో ఆరోపణలు...

నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ విద్యావిధానంలో ఇంజినీరింగ్ చదువుతున్న 6,600 మంది విద్యార్థులకు మూడు మెస్‌ల ద్వారా భోజన సదుపాయాలను అందిస్తున్నారు. ఇదే క్యాంపస్‌లో శ్రీకాకుళం క్యాంపస్‌కు చెందిన మరో 2 వేల మంది విద్యార్థులు సైతం వసతి పొందుతుండగా వారికి అదనంగా మరో మెస్‌ను నిర్వహిస్తున్నారు. అయితే చాలీచాలని రుసుములతో భోజన నాణ్యత అందించడంలో ఎదుర్కొంటున్న పరిస్థితులపై గత వైసీపీ ప్రభుత్వంలో నాటి ఛాన్సలర్ కె.సి రెడ్డి దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకువెళ్ళింది. నాడు మెస్ ఛార్జీల పెంపు తమ దృష్టిలోనే ఉందని, జాతీయ ఏజన్సీలు నిర్ణయం మేరకు ధరలు పెంచుతామని ఛాన్సలర్ హోదాలో కె.సిరెడ్డి ప్రకటించారు. అయితే మెస్ నిర్వాహ కులు టెండర్లలో దాదాపు రూ.110 కోడ్ చేయగా, ఎవరో రూ.88లకు కోడ్ చేశారని ఆ ధరకే (కోడ్‌చేసిన టెండర్‌దారు అసలు మెస్‌లను ప్రారంభించలేదు) అందించాలని రివర్స్ టెండరింగ్‌తో రూ.88లకే మెస్ టెండర్లను ఖరారు చేశారు. ప్రస్తుతం పెరిగిన ధరల నేపథ్యంలో భోజన నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో గత ఆగస్ట్, సెప్టెంబరులలో మెస్ టెండర్లను రద్దుచేసి కొత్త టెండర్లను పిలుస్తామని విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వ కమిటీలు, జిల్లాస్థాయి అధికారులు పేర్కొన్నారు. అయినా నూతన టెండర్లు నేటికీ ఖరారు కాలేదు. జాతీయ ఏజన్సీలు నిర్ణయించిన మేరకు మెస్ టెండర్ల ధరలు పెంచి నాణ్యమైన భోజనం అందించాల్సిన బాధ్యత ఆర్జీయూకేటీ యాజమాన్యంపై ఉంది. ఆర్జీయూకేటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి త్వరితగతిన ఆర్జీయూకేటీ యాజమాన్యం, గవర్నింగ్ కౌన్సిల్ చర్యలు చేపట్టాల్సి ఉంది. ప్రస్తుత సెలవుల్లో ల్యాప్‌టాప్‌ల కొనుగోలు, యూనిఫాం, మెస్ తదితర టెండర్లను ఖరారు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పోలవరంలో కురుస్తున్న వర్షం
చింతలపూడిలో కురుస్తున్న వర్షం
నిడమర్రులో ఏర్పాటు చేసిన ఏరియేటర్లు
జీలుగుమిల్లిలో రోడ్డుపై కూలిన చెట్టు
జంగారెడ్డిగూడెంలో నేలకూలిన విద్యుత్ స్తంభం

దంచికొట్టిన వర్షం

- వరి, మొక్కజొన్న మామిడి రైతుల్లో ఆందోళన
- గ్రామాల్లో పర్యటించి సూచనలిచ్చిన అధికారులు
- రైతులకు అధికారులు అందుబాటులో ఉండాలి : ఎమ్మెల్యే చింతమనేని

(ఆంధ్రజ్యోతి- నెట్‌వర్క్) : ఏలూరు జిల్లా వ్యాప్తంగా వర్షం దంచికొట్టింది. రెండు గంటల పాటు తీవ్ర స్థాయిలో పెనుగాలులు బీభత్సాన్ని సృష్టించాయి. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు కురిసిన వర్షానికి ఏలూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో రెండు చెట్లు నేలకొరిగాయి. మస్తాన్ మన్యం కాలనీలో చెట్లు విరిగి కరెంటు స్తంభాలపై పడటంతో అవి ధ్వంసమయ్యాయి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక్క మల్కాపురం రైతు సేవాకేంద్రం పరిధిలో 1500 మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కల్లాల్లో ఉండిపోయిందన్నారు. కార్యక్రమంలో ఆదాడ శ్రీనివాసరావు, లంకా వెంకట రమణ, గొర్రెల రొయ్యారావు, గుర్రాల శోభన్‌బాబు, కండిబోయిన రమేష్, బత్తుల యేసు, బి.శివకుమార్ పాల్గొన్నారు. ఉంగుటూరు మండలంలో జేసీ ధాత్రిరెడ్డి పర్యటించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ వ్యవసాయ మండలి మాజీ జిల్లా సభ్యులు యెలిశెట్టి పాపారావు బాబ్జి మాట్లాడుతూ ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. కాగుపాడు మాజీ సర్పంచ్ కడియాల రవి శంకర్ మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే ధర్మరాజును కోరారు. కౌలు రైతు సంఘం నాయకులు దుడే కేశవరావు, కొర్ని అప్పారావులు మాట్లాడుతూ ట్రక్ షీట్ లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వచ్చిందని, అందుకే బొమ్మిడి సొసైటీ వద్ద రైతులు ఆందోళన చేశారన్నారు. కామవరపుకోట మండలంలో మామిడి, జీడిమామిడి పంటకు తీవ్ర నష్టం ఏర్పడింది. తూర్పుయడవల్లి, రామన్నపాలెం, గుంటుపల్లి తదితర గ్రామాల్లో మామిడికాయలు పెద్ద సంఖ్యలో నేలరాలాయి. నిడమర్రు మండలంలో ధాన్యం బస్తాలు తడిసిముద్దవగా, రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ సమస్య తలెత్తడంతో ఏరియేటర్లు తిప్పారు. చింతలపూడి పరిసర గ్రామాల్లో ఈదురు గాలులకు విద్యుత్ నిలిచిపోయింది. లింగపాలెం మండలంలో తహసీల్దార్ ప్రసాద్, మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ పరిశీలించారు. ధాన్యం పూర్తి స్థాయిలో ఆరబెట్టుకుని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. పెదవేగి మండలంలో మొక్కజొన్న, వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఈ వర్షం నిమ్మ, కొబ్బరి, పామాయిల్, జామ, సపోటా వంటి ఉద్యాన పంటలకు లాభదాయకంగా ఉంటుందని రైతులు వివరిస్తున్నారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. బుట్టాయగూడెం మండలంలో అలివేరులో రోడ్డుకు అడ్డంగా చెట్టు పడిపోగా లంకపాకల గ్రామంలో ఓ ఇంటిపై రేకులు ఎగిరిపోయాయి. ఇదే గ్రామంలో రెండుచోట్ల విద్యుత్ స్థంభాలు నేలకొరిగాయి. పోలవరం మండలంలో పోలవరం ప్రాజెక్టు రోడ్డు, పట్టిసీమ కొత్తపట్టిసీమ, గూటాల, పాతపోలవరం, బంగా రమ్మపేట ప్రాంతాల్లో ఆరబెట్టిన ధాన్యం, మొక్కజొన్న పంటలు తడిసిపోయాయి. పోలవరం మెయిన్ రోడ్డు, బీసీ కాలనీ, బెస్తావీధి, బాపూజీ కాలనీ, కొత్తపేట కాలనీల్లో డ్రెయినేజీలు పొంగి మురుగు నివాసాల మధ్య నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ద్వారకాతిరుమల మండలం సత్తెన్నగూడెం, రాళ్లకుంట, జి.కొత్తపల్లి, రామశింగవరం తదితర ప్రాంతాల్లో మామిడి తోటలకు అపారనష్టం వాటిల్లింది. చెట్లు విరిగిపడటంతో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఏఎంసీ మార్కెట్ యార్డులో గొడౌన్ అందుబాటులో ఉంచామని ఏవో దుర్గారమేశ్ తెలిపారు. ఏలూరు మినీ బైపాస్ రోడ్లులో భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో త్రిటౌన్ పోలీసులు, ఇతర అధికారులు కలిసి చెట్టును తొలగించి ట్రాఫిక్‌నకు అంతరాయం లేకుండా చేశారు. ఏలూరు వన్‌టౌన్‌లో కూడా ఇళ్ళపై పడి పలు చెట్లను అధికారులు యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. భీమడోలు మండలంలోని గుండుగొలను తదితర ప్రాంతాల్లో చెట్లు నేలకు ఒరిగాయి. పోలసానపల్లి తదితర జాతీయ రహదారులలో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెంలో బర్రింకలపాడు, కామయ్యపాలెం, పి.అంకంపాలెం గ్రామాల్లో వేరుశనగ పంట కొంత మేర తడిచింది. కొందరు రైతులు టార్పాలిన్‌లు కప్పి వర్షానికి తడవకుండా జాగ్రత్త పడ్డారు. పూచికపాడు-అంకన్నగూడెం గ్రామాల మధ్య రోడ్డుపక్కన ఉన్న చెట్టు రహదారికి అడ్డంగా పడింది. దీంతో ఆంధ్రా, తెలంగాణ నుంచి గుబ్బలమంగమ్మ గుడికి వెళ్లే భక్తులు కొంత ఇబ్బందులు పడ్డారు.



పోలవరం ప్రాజెక్టు రోడ్డులో ఉన్న ధాన్యం





లింగపాలెం, గురవాయిగూడెంలో తడిచిన ధాన్యం పరిశీలిస్తున్న అధికారులు



కాగుపాడులో ధాన్యంపై కప్పిన బరకాలు



పోలవరంలో బరకాలు కప్పుతున్న రైతులు

వైభవంగా బ్రహ్మోత్సవాలు

ఏలూరు టూటౌన్, మే 4(ఆంధ్రజ్యోతి) : ఆర్.ఆర్.పేటలో కొలువైన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ 36వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో తనని భాగస్వామిని చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్ర మంలో డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, ఆలయార్చకులు కె.మారుతి శ్రీనివాస రామానుజాచార్యు లు, ఈవో సతీశ్ కుమార్, మాజీ ధర్మకర్త ఈతకోట శ్రీని వాసరావు, పాలడుగు రమాదేవి, పాల్గొన్నారు.

పెరుగ్గూడెంలో ఆలయ పునః ప్రతిష్ఠ

దెందులూరు : మండలంలోని పెరుగ్గూడెం గ్రామంలో దక్షిణాముఖ విఘ్నేశ్వరస్వామి ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. గత రెండు రోజులుగా వేద పండితులు హోమాలు నిర్వహించి సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్నివీరాంజనేయులు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, మాజీ సర్పంచ్ యలమర్తి హేమ శ్రీనివాస్, టీడీపీ గ్రామాధ్యక్షుడు దశరథ రామయ్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా పుంతలో ముసలమ్మ జాతర

దెందులూరు : చల్లని తల్లిగా పేరు పొందిన కొవ్వలి గ్రామ శివారున ఉన్న పుంతలో ముసలమ్మను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరను పురస్కరించుకుని ఆదివారం ఉదయం నుంచి పుంతలో ముసలమ్మకు ఆలయ ధర్మకర్త అలపాటి రామకృష్ణ నూతన వస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు మల్లవరపు రంగారావు, డీసీ చైర్మన్ వెలమాటి రామచంద్ర ప్రసాద్(రాంబాబు), నెర్సు వెంకట రమణ, గుత్తా రాజా,వెలమాటి బుడ్డియ్య, పండు కలిసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన నిర్వహించారు.

రామాలయ నిర్మాణానికి భూమి పూజ

పోలవరం : స్థానిక బెస్తావీధిలో 125 సంవత్సరాల క్రితం నిర్మించిన జానకీ సమేత రామచంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ భూమి పూజను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వహకులు పాయల శ్రీను, వెంకన్న, మాబు, కేతా దేవకి, ఇల్లా రంగా, ఇల్లా వెంకటేశ్వరరావు, అయ్యల రాంబాబు, విశ్రాంత ఉపాధ్యాయులు ఆనందరావు, బి.పోశి, జనసేన నాయకులు గునపర్తి చిన్ని, చెల్లింకుల రాఘవులు, తెలగంశెట్టి రవి దంపతులు, అర్చకుడు ఆర్.చంద్రశేఖర్ పాల్గొన్నారు. నూతనగూడెంలో దత్త వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు ఆలయ స్థాపకులు వేపకాయల వెంకన్నబాబు, అర్చకుడు శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఉంగుటూరు : నారాయణపురంలో నాలుగు రోజుల పాటు జరిగే శ్రీభూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు,వసంత కుమారి దంపతుల చేతుల మీదుగా పూజలు నిర్వహించారు. తొలిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలను పంచిపెట్టారు.

ఆధ్యాత్మికం

శ్రీరాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి : రాట్నాలకుంటలో కొలువైన శ్రీరాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు.సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. అమ్మవారికి పాలపొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయార్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారాయణ శర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్య శర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీశ్ కుమార్ తెలిపారు.

సూర్యనారాయణ స్వామికి పూజలు

ఏలూరు కార్పొరేషన్ : పవరుపేట స్టేషన్ రోడ్డులోని శ్రీధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద ఆదివారం భాను సప్తమి సందర్భంగా సూర్యనారాయణ స్వామికి పంచామృతాభిషేకం, అనంతరం సూర్య, ధన్వంతరి, మృత్యుంజయ హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆదిశర్మ భక్తులతో పూజలు చేయించారు. ఆలయ చైర్మన్ కోరాడ రెడ్డి, పూర్ణ, రాజు మిత్ర బృందం భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.



కూచింపూడిలో ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు



బొర్రంపాలెంలో పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పెదవేగి, మే 4(ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం కూచింపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో 1996- 97 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసి, ఎక్కడెక్కడో స్థిరపడిన వీరంతా 29ఏళ్ల తరువాత తాము చదివిన పాఠశాలల్లో కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను తలుచుకున్నారు. తాము ఎదిగిన విధానాన్ని సహచరులకు గర్వంగా వివరించారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. చివరిగా అక్కడకు సమీపంలోని రామశింగవరంలోని శ్రీకొండాలమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి, అమ్మవారిని దర్శించుకుని అక్కడే భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లా రమేష్, వేట నాగరాజు, కె.జగ్జీవనరావు, పి.కాంతారావు, మల్లుల దుర్గాప్రసాద్, అడపా బాలాజీ, ధనలక్ష్మి,విజయలక్ష్మి, అన్నపూర్ణ, కళావతి, అపర్ణ, దయామణి తదితరులు పాల్గొన్నారు.

● టి.నర్సాపురం :మండలంలోని బొర్రంపాలెం జడ్పీ ఉన్నతపాఠశాలలో 2001-2002 సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను స్మరించుకున్నారు. ఆ సమ యంలో వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయు లను ఘనంగా సన్మానించారు.



విగ్రహానికి పూలమాల వేస్తున్న సంఘ నాయకులు

భగీరథ మహర్షికి నివాళులు

ఏలూరు రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): భగీరథుడి స్ఫూర్తితో సగరులు అభివృద్ధి చెందాలని రాష్ట్రసగర ఉప్పర సంఘం అధ్యక్షుడు తాడిశెట్టి గోపీరావు అన్నారు. స్థానిక పిరంగుల దిబ్బ అంజనేయస్వామి ఆలయం వద్దనున్న భగీరథ మహర్షి విగ్రహం వద్ద జయంతిని నిర్వహించారు. తొలుత భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర సగర న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి గండికోట సీతారామరాజు, సంఘ నాయకులు పాల్గొన్నారు. ఉంగుటూరు మండలం రావులపర్రు చెర్వుగట్టుపైన ఉన్న భగీరథ విగ్రహానికి సగర సామాజిక వర్గం ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా యువజన సంఘం ఉపాధ్యక్షులు గాది వెంకట రమణ ఆధ్వర్యంలో భగీరథుడి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

ఏలూరు రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం జిల్లా స్థాయిలో పాటు మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయి లో యథావిధిగా జరగనుంది. ఈ మేరకు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు యోగాపై శిక్షణ

ఏలూరుటూటౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు పర్యవేక్షణలో రిసోర్స్ పర్సన్ డి.శ్రీవల్లి విద్యార్థులకు యోగా క్లాసులు, నీతికథలు చెప్పారు. నృత్యకళాకారులు వై.ఫణికాంత్ విద్యార్థులకు నృత్యాలపై శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయులు నాగాస్త్రం,పంచతంత్రం కథలు, మర్యాదరామన్న నీతి కథలు బోధించారు.విద్యార్థులకు ఆట, పాటలు, కథలు, కథనాలు, నృత్యాలు, జనరల్ నాలెడ్జ్, గణితం, క్రాఫ్ట్‌లో శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ వి.టి.సందీప్‌కుమార్, అస్లాంపాష పాల్గొన్నారు.

నేడు ఎంపీ పోలవరం పర్యటన

పోలవరం, మే 4 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో సోమవారం పర్యటించనున్నట్టు టీడీపీ మండలాధ్యక్షులు బొడ్డు కృష్ణ ఆదివారం తెలిపారు. రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టు నుంచి ఉదయం 10 గంటలకు పోలవరం ప్రాజెక్టుకి చేరుకుంటారని,పోలవరం ప్రాజెక్టులో జరుగుతున్న పనుల పురోగతిని స్వయంగా పర్యవేక్షిస్తారని తెలిపారు. అనంతరం మండలంలో ఇటీవల భారీ వర్షాలకు తడిసిన వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడతారని తెలిపారు.

మల్లుకుంటలో పర్యటన..

టి.నర్సాపురం :మల్లుకుంట గ్రామంలో ఎంపీ సోమవారం పర్యటించనున్నట్టు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామంలో జరిగే గంగానమ్మతల్లి జాతర మహోత్సవంలో పాల్గొని అమ్మవార్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు.

అంజుమన్ సేవలు అభినందనీయం

ఏలూరు టూటౌన్, మే4 (ఆంధ్రజ్యోతి): అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. అంజుమన్ హాల్లో అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అంజుమన్ అధ్యక్షుడు ఎండీ జబీఉల్లా, కార్పొరేటర్ ఇలియాజ్ పాషఅంజుమాన్ వ్యవహారాల అధ్యక్షులు రాజ అహ్మద్, సెక్రటరీ అహ్మదుల్లా షరీఫ్, కోశాధికారి షేక్ సిరాజ్ బాష, జాకీర్ హుస్సేన్, ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

50 శాతం సబ్సిడీపై దాణా

ఏలూరు టూటౌన్, మే4(ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు పశుదాణాను 50శాతం సబ్సిడీ అందజేస్తున్నట్టు ఎమ్మెల్యే చంటి తెలిపారు. 46వ డివిజన్ పశువైద్యశాలలో దాణాను ఎమ్మెల్యే చంటి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు న్యాయం చేయాలనే దృక్పథంతో ముందుకు వెళ్తుందన్నారు.ఎన్నడూలేని విధంగా పాడిరైతులకు దాణా సబ్సిడీపై అందిస్తున్నామన్నారు. పాడి రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం, డాక్టర్ బి.జ్యోతిస్వరూప, తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అంపైర్‌గా నాగేంద్రసింగ్



ఏలూరు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ క్రికెట్ కంట్రోల్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఇప్పటి వరకు వందకు పైగా క్రికెట్ మ్యాచ్‌లను నిర్వహించింది. వికలాంగులకు భారత దేశంతో పాటు ఇతర దేశాల్లోనూ మ్యాచ్‌లు నిర్వహించింది. కాగా 2019నుంచి ఏలూరుకు చెందిన నాగేంద్ర సింగ్ వివిధ దేశాలలో చేసిన అంపైరింగ్ మ్యాచ్‌లకు గానూ 2025 సంవత్సరానికి బెస్ట్ అంపైర్ అవార్డు ప్రకటించింది. ఈ మేరకు క్రికెట్ కంట్రోల్ బోర్డ్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి హరూన్ రషీద్ లేఖను అందజేయనున్నట్టు నాగేంద్ర జింగ్ తెలిపారు. ఈ నెల 9న అవార్డును ఆగ్రాలో ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. నాగేంద్రసింగ్‌ను ఉపాధ్యాయులు, అధికారులు అభినందించారు.

వైఎంహెచ్ఏ కమిటీ ఎన్నిక

ఏలూరు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఏ) సర్వసభ్య సమావేశం ఆదివారం ఏలూరు వైఎంహెచ్ఏ హాల్లో జరిగింది. ఈ సమావేశంలో మూడేళ్ళ కాలపరిమితికి మేనేజ్మెంట్ కమిటీ, కార్యనిర్వాహక కమిటీలకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా యర్రా సోమలింగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కనిగోళ్ళ కుమార్ గుప్తా, ఎంవీవీఎస్ నాగేశ్వరరావు వేమా కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కెవి సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా సిహెచ్ సాయి తేజ, డా.గుడిపాటి లలితా శర్మ, కోశాధికారిగా కానాల బాల వెంకట రమేష్, సభ్యులుగా మోతే శ్రీనివాస నారాయణరావు, వంకినేని భానుప్రకాష్, రేపూరి శివశంకర వరప్రసాద్, వివివి హనుమంతరావు, డా.లంకా వెంకటేశ్వర్లు, బంకా ప్రసాద్, పెదపాటి రామకృష్ణ, శలా మాణిక్యాలరావు, ఎ.నాగమణి, బుద్ధదేవ్‌లను ఎన్నుకున్నారు. అలాగే కార్యనిర్వాహక కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన ఇరు కమిటీలు సంఘ అభ్యున్నతికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశాయి.

ఆదర్శ ప్రాథమిక-ఉన్నత పాఠశాలగా పెదగొన్నూరు హైస్కూలు

ముదినేపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): పెదగొన్నూరులోని శ్రీ కాజ లక్ష్మీనారాయణ మెమోరియల్ జిల్లా పరిషత్ హైస్కూలు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆదర్శ ప్రాథమిక - ఉన్నత పాఠశాలగా మారనుంది. ప్రభుత్వం కొత్త వ్యవస్థ నేపథ్యంలో ఈ హైస్కూలు స్వరూపం మారనుంది. ఇప్పటికే ఈ హైస్కూలులో 3 నుంచి 10 వరకు తరగతులను నిర్వహిస్తుండగా, కొత్తగా అమలులోకి రానున్న 9 బదుల వ్యవస్థలో 1, 2 తరగతులను కూడ ఏర్పాటు చేయనున్నారు. దీంతో పెదగొన్నూరు జడ్పీ హైస్కూల్‌లో ప్రాథమిక స్థాయి నుంచి హైస్కూలు విద్య వరకు తరగతులు అందుబాటులోకి వస్తున్నాయి.

వేసవి విజ్ఞాన శిబిరాలు

కలిదిండి మే 4 (ఆంధ్రజ్యోతి): కలిదిండి, కోరుకొల్లులో గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులచే పుస్తక పఠనంతోపాటు న్యూస్ పేపర్లు చదివించారు. ఈ సందర్భంగా కలిదిండి, కోరుకొల్లు గ్రంథాలయాధికారులు రమేష్ బాబు, రాఘవులు మాట్లాడుతూ విద్యార్థులు జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను చదవటం అలవర్చుకోవాలన్నారు.

పెద్దింటి అమ్మవారికి భక్తుల తాకిడి


ఆలయ ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

కైకలూరు, మే 4(ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట పెద్దింటి అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని పూజలు చేశారు. ఆది వారం వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి పాలపొంగళ్ళను నైవేద్యంగా సమర్పించి మొక్కుబడులను చెల్లించుకున్నారు. ఆదివారం భారీ వర్షం కురవడంతో ఆహ్లాదకరమైన కొల్లేరు అందాలను భక్తులు చూసి పరవసించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ


రాములోరికి మాజీ ఎమ్మెల్యే నాగేశ్వరరావు పూజలు

ముదినేపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం గురజ గ్రామంలో సుమారు రూ.25 లక్షల వ్యయంతో పునర్నిర్మించిన సీతారామాలయంలో స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠోత్సవం ఆదివారం ఉదయం వైభవంగా జరిగింది. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. వేదపండితుల మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య వినాయకుడు, సీతారామ లక్ష్మణ, అంజనేయస్వామి వార్ల విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం ఆలయ శిఖర ప్రతిష్ఠ, స్వామివార్ల శాంతి కల్యాణాన్ని నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు జరిపారు. మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోమటి విష్ణు వర్ధన్, సింగంశెట్టి రాము, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పేర్ని గిరి తదితరులు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి


ముసునూరులో కేక్‌ను కట్ చేస్తున్న సగర సంఘం నాయకులు

ముసునూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): ముసునూరులో శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలను సగర సంఘం నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న భగీరథ మహర్షి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం భారీ కేక్‌ను కట్‌చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. భగీరథ మహర్షి ఫ్లెక్సీకి సుందరంగా అలంకరణ చేసి మేళతాళాలు మంగళ వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు.

పెదగొన్నూరు ప్రముఖురాలు దుర్గాదేవి మృతి



ముదినేపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం పెదగొన్నూరు గ్రామ ప్రముఖురాలు, ఆగ్రామ పంచాయతీకి సుదీర్ఘకాలం సర్పంచ్‌గా వ్యవహరించిన స్వర్గీయ కాజా రామకృష్ణారావు సతీమణి దుర్గాదేవి (80) మరణించారు. కొంతకాలంగా అస్వస్థతతో ఉన్న ఆమె ఆదివారం హైదరాబాద్‌లో తుది శ్వాస విడిచారు. ఆమె దుర్గా ఆర్ట్స్ అధినేత, సినీ నిర్మాత డాక్టర్ కెఎల్ నారాయణకు స్వయానా పినతల్లి. ఆమె కుమారుడు శ్రీనివాస్ హైదరాబాద్‌లో ప్రముఖ వ్యాపారవేత్త. దుర్గాదేవి మృతి పట్ల ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, మాజీ ఎంపీ మాగంటి బాబు, ఏలూరు సీఆర్‌రెడ్డి విద్యా సంస్థల ఛైర్మన్ ఇంద్రకుమార్, పెదగొన్నూరు గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

ట్రబుల్ ఐటీ!

(ఐదో పేజీ తరువాయి)

సంవత్సరం విద్యార్థులకు విద్యాసంవత్సరం పూర్తి కావొస్తున్నా అందించలేదు. మరోవైపు విద్యార్థినులు తమకు కనీసం రెండేళ్లకు ఒక జత యూనిఫాం ఇవ్వాల్సిందిగా పలుమార్లు యూనివర్సిటీ అధికారులకు మొరపెట్టుకున్నా అది ఆచరణలోకి రాలేదు. ఈ నేపథ్యంలో అసౌకర్యాల నడుమ విద్యార్థులు విద్యాసంవత్సరాన్ని పూర్తి చేయగా, ఇటీవల నూతన విద్యాసంవత్సరం ప్రారంభానికి నోటిఫికేషన్‌ను యూనివర్సిటీ విడుదల చేసింది. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు అవసరమైన ల్యాప్ టాప్‌లను, యూనిఫాం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో గత ప్రభుత్వ నిర్లక్ష్య విధానాలను టీడీపీ ప్రభుత్వం సరిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రివర్స్‌టెండరింగ్‌తో అనేక ఆరోపణలు

నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ విద్యావిధానంలో ఇంజినీరింగ్ చదువుతున్న 6,600 మంది విద్యార్థులకు మూడు మెస్‌ల ద్వారా భోజన సదుపాయాలను అందిస్తున్నారు. ఇదే క్యాంపస్‌లో శ్రీకాకుళం క్యాంపస్‌కు చెందిన మరో 2 వేల మంది విద్యార్థులు సైతం వసతి పొందుతుండగా వారికి అదనంగా మరో మెస్‌ను నిర్వహిస్తున్నారు. అయితే చాలీచాలని రుసుములతో భోజన నాణ్యత అందించడంలో ఎదుర్కొంటున్న పరిస్థితులపై గత వైసీపీ ప్రభుత్వంలో నాటి ఛాన్సలర్ కె.సిరెడ్డి దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకువెళ్ళింది. నాడు మెస్ ఛార్జీల పెంపు తమ దృష్టిలోనే ఉందని, జాతీయ ఏజన్సీలు నిర్ణయం మేరకు ధరలు పెంచుతామని ఛాన్సలర్ హోదాలో కె.సిరెడ్డి ప్రకటించారు. అయితే మెస్ నిర్వాహ కులు టెండర్లలో దాదాపు రూ.110 కోడ్ చేయగా, ఎవరో రూ.88లకు కోడ్ చేశారని ఆ ధరకే (కోడ్‌చేసిన టెండర్‌దారు అసలు మెస్‌లను ప్రారంభించలేదు) అందించాలని రివర్స్ టెండరింగ్‌తో రూ.88లకే మెస్ టెండర్లను ఖరారు చేశారు. ప్రస్తుతం పెరిగిన ధరల నేపథ్యంలో భోజన నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో గత ఆగస్టు, సెప్టెంబరులలో మెస్ టెండర్లను రద్దుచేసి కొత్త టెండర్లను పిలుస్తామని విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వ కమిటీలు, జిల్లాస్థాయి అధికారులు పేర్కొన్నారు. అయినా నూతన టెండర్లు నేటికీ ఖరారు కాలేదు. జాతీయ ఏజన్సీలు నిర్ణయించిన మేరకు మెస్ టెండర్ల ధరలు పెంచి నాణ్యమైన భోజనం అందించాల్సిన బాధ్యత ఆర్జీయూకేటీ యాజమాన్యంపై ఉంది. ఆర్జీయూకేటీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి త్వరితగతిన ఆర్జీయూకేటీ యాజమాన్యం, గవర్నింగ్ కౌన్సిల్ చర్యలు చేపట్టాల్సి ఉంది. ప్రస్తుత సెలవుల్లో ల్యాప్‌టాప్‌ల కొనుగోలు, యూనిఫాం, మెస్ తదితర టెండర్లను ఖరారు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





ఆగిరిపల్లిలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు.. చాట్రాయిలో వర్షం.. కైకలూరులో జాతీయ రహదారిపై కూలిన చెట్టు.. కలిదిండిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

బీభత్సం

» ఈదురుగాలులతో భారీ వర్షం » నేలరాలిన మామిడి - విరిగిన అరటిచెట్లు » వాగులను తలపించిన రహదారులు » తెగిన విద్యుత్ లైన్లు » కైకలూరు నియోజకవర్గంలో నేలకొరిగిన 60 విద్యుత్ స్తంభాలు

ముసునూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో ఆదివారం ఉదయం కురిసిన భారీ వర్షం బీభత్సాన్ని సృష్టించింది. ముసునూరు మండల వ్యాప్తంగా ఈదురుగాలుల తీవ్రతకు పలు గ్రామాల్లో మామిడి నేలరాలగా, అరటి చెట్లు సైతం విరిగిపోయి నేలకుఒరిగాయి. రమణక్కపేట, లోపూడి, సూరేపల్లి తదితర గ్రామాల్లో కోతకు వచ్చిన మామిడిపంట నేపాలవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ముసునూరు, కాట్రేనిపాడు, అక్కిరెడ్డిగూడెం, చెక్కపల్లి గ్రామాల్లో అరటిపంట నేలకుఒరిగింది. గెల దశలో ఉన్న అరటిచెట్లు సగానికి విరిగిపోవడం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో విద్యుత్ లైన్‌లు ధ్వంసం కావడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ పునరుద్ధణకు చర్యలు చేపట్టారు.

ముదినేపల్లి: ముదినేపల్లి ప్రాంతంలోని పలు చోట్ల చెట్లు కూలి విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. పెదగొన్నూరు, బొమ్మినంపాడు గ్రామాల్లో ఆరు విద్యుత్ స్తంభాలు కూలిపోవటంతో విద్యుత్ లైన్లు తెగిపోయాయి. దీంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం కలిగింది. ముదినేపల్లి సెక్షన్ ఏఈ పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో సిబ్బంది విద్యుత్ లైన్ల పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ముదినేపల్లి - బంటుమిల్లి రహదారిలో ఉప్పరగూడెం సమీపంలో పెదలంక డ్రెయిన్ వంతెన వద్ద రోడ్డుపై చెట్టు కూలిపోవటంతో గంటకుపైగా ఆ రూటులో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి.

కలిదిండి: కలిదిండి పరిసర గ్రామాల్లో ఆదివారం ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయం అయ్యాయి. కలిదిండి - కోరుకొల్లు రహదారిపై చెట్లు నేలకొరిగాయి. యుద్ధప్రాతిపదికన గ్రామస్థులు సహకారంతో అధికారులు వృక్షాలను తొలగించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగటంతో రొయ్యల చెరువుల్లో ఏరియేటర్లను జన రేటర్ల ద్వారా తిప్పుతున్నారు. పలు చెరువుల్లో ఆక్సిజన్ లోపించటంతో ఆక్సిజన్ టాబ్లెట్స్‌ను చెరువుల్లో వేస్తున్నారు. చేపల చెరువుల్లో పెద్ద సైజు చేపలు ఎగ్‌తో ఉండటంతో ఆక్సిజన్ కొరతతో చనిపోయే ప్రమాదం ఉండటంతో చేపల చెరువుల్లో ఖరీదైన మందులు చల్లుతున్నారు. కలిదిండి బస్టాండ్ వద్ద ప్రధాన రహదారి జలమయం కావటంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

పెద్ద శబ్ధాలు ఉరుములతో కూడిన వర్షం కురవటంతో ప్రజలు భయాందోళన చెందారు.

చాట్రాయి: మండలంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి వాతావరణం చల్లబడింది. ఉదయం 8 గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయి చీకట్లు కమ్మి ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. అక్కడక్కడ కల్లాల మీద ఉన్న దాళ్వా ధాన్యం తడిసింది. ఈ వర్షం ఖరీఫ్ దుక్కులు దున్నుకోవటానికి, పచ్చి రొట్ట సాగుకు ఉపయోగంగా ఉంటుందని రైతులు అంటున్నారు. నెల రోజుల నుంచి నిప్పులు చెరిగే ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనాన్ని కలిగించింది.

నూజివీడు టౌన్: నూజివీడు పట్టణ, మండల ప్రాంతాల్లో ఆదివారం ఉదయం కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. దాదాపు 15 రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతూ వెళుతుండగా పట్టణ వాసులు ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం కారు మబ్బులు కమ్ముకు వచ్చి ఒక్కసారిగా వర్షం నమోదు కావడంతో పట్టణ వాసులతో పాటు గ్రామాల్లో పలువురు సేద తీరారు. ఎటువంటి గాలులు లేకపోవడంతో మామిడి రైతులకు ఊపిరి పీల్చుకున్నారు.

కైకలూరు: కైకలూరు నియోకవర్గంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి ఎక్కడికక్కడే వృక్షాలు, 60 విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగాయి. ఈ భారీ వర్షాలకు డ్రెయిన్‌లు పొంగి రహదారులు నీటమునినిగాయి. కైకలూరులో రహదారులు జలమయమయ్యాయి.

కైకలూరు రైతు బజార్ వద్ద భారీ వృక్షం జాతీయ రహదారిపై కూలిపోవడంతో కొంతసేపు రాకపోకలను ఇబ్బందులు కలిగాయి. వర్షం ఆగిన వెంటనే గ్రామ పంచాయతీ, పోలీస్‌లు యుద్ధప్రాతిపదికన చెట్లను తొలగించారు. మండలంలోని ఆలపాడులో చేపల చెరువు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. గోపవరంలో అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు ప్రమాదకర స్థితిలో విరిగిపోయాయి. నియోకవర్గ వ్యాప్తంగా 60 కరెంట్ స్తంభాలు దెబ్బతిన్నట్లుగా అధికారులు పేర్కొంటున్నారు.

సేద తీరిన కొల్లేరు పక్షులు

ఎండ వేడితో అల్లాడిన కొల్లేరు పక్షులు సైతం అకాల వర్షంతో సేద తీరాయి. గాలివానకు పక్షులు ఆకాశంలో చక్కెర్లు కొడుతూ ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి.

మండవల్లి: మండవల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడింది. ఉదయం 9 గంటల నుంచి కారు మబ్బులు పట్టి వర్షం పడుతుండటంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. అకాల వర్షంతో రొయ్యల, చేపల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈదురు గాలుల ప్రభావం వల్ల విద్యుత్ సరఫరాకు అవరోధం ఏర్పడింది. ఆదివారం సాయంత్రం వరకు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఆక్వా చెరువుల రైతులు జనరేటర్‌లపై అనేక అవస్థలు పడ్డారు. అకాల వర్షంతో జలజీవనం స్తంభించింది.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఈదురుగాలులతో వర్షం కురిసింది. పలుచోట్ల రహదారులపై నీరు నిలిచింది. చాలా రోజులుగా వేసవి ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించింది. ఈ అకాల వర్షం వల్ల మామిడి రైతులకు నష్టం కలిగించింది. ఈదురుగాలుల వల్ల కొన్ని చోట్ల మామిడి కాయలు నేలరాలాయి.





మండవల్లిలో ఈదురు గాలులు.. ముదినేపల్లిలో రోడ్డుపై పడ్డ చెట్టును తొలగిస్తున్న దృశ్యం.. ముసునూరులో పడిపోయిన అరటి తోట.. ముసునూరులో రోడ్డుపై నీటి ప్రవాహం

విద్యుత్ టవర్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

కైకలూరు, మే 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు వేగవంతంగా నిర్వహించి త్వరితగతిన సరఫరాను పునరుద్ధరించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ భాగ్యరాజు అన్నారు. ఆదివారం మండవల్లి మండలం పసలపూడి గ్రామంలో ఇటీవల ఈదురుగాలులకు ఇరిగిపడిన 132 కేవీ టవర్ మరామ్మతుల పనులను ఆయన పరిశీలించారు. టవర్ నిర్మాణంపై గల జాప్యంపై ఆయన ఆరా తీశారు. స్థానిక అధికారులు అతిపెద్ద చేపల చెరువులో టవర్ ఇరిగిపడిపోవడం వలన మళ్ళీ నిర్మాణం చేయడానికి ఎక్కువ సమయం పడుతుందని అంటూ ఆలస్యానికి గల కారణాలను వివరించారు. దీంతో ఎస్ఈ మాట్లాడుతూ మరో నాలుగు రోజుల్లో పూర్తిస్థాయిలో పనులను నిర్వహించి కైకలూరు నియోకజకవర్గానికి నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో గుడివాడ విద్యుత్‌శాఖ ఈఈ జి.పి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి

నూజివీడు టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి):విద్యతో పాటు క్రీడల్లోనూ సమానంగా రాణించాలని నూజివీడు డీవైఈవో సేవియా నాయక్ అన్నారు. నూజివీడు విక్టోరియా టౌన్‌హాల్లో నిర్వహిస్తున్న సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్‌ను ఆయన సందర్శించారు. బాస్కెట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ తదితర క్రీడల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులను శిక్షణకు సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుల పై తల్లి దండ్రులు పూర్తి దృష్టి సారిస్తున్నారని, క్రీడలపై కూడా విద్యార్థుల్లో మక్కువ పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో క్యాంప్ కోచ్ నాగరాజు, వనజ, లక్ష్మి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి ప్రసాద్

నేర నియంత్రణకు సీసీటీవీ కెమెరాలు

ఆగిరిపల్లి,మే 4 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాల వినియోగంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి ప్రసాద్ పర్యవేక్షణలో ఆగిరిపల్లి ఎస్సై శుభశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న మర్చంట్స్ ఛాంబర్ అసోసియేషన్ సభ్యులతో సీసీ కెమెరాల వినియోగంపై సమావేశం నిర్వహించారు. డీఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ నేర నిరోధనలో సీసీ కెమెరాల కీలక పాత్రను వివరించి, ప్రతి వ్యాపార స్థలంలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు అవసరమని తెలిపారు. షాప్ యజమానులందరూ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సైబర్‌నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఎవరైనా బాధితులు వెంటనే 1930 నెంబర్‌కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలంటూ సూచించారు.

అదనపు కట్నం కేసు

కలిదిండి మే 4 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తెమ్మని వేధింపులకు పాల్పడుతున్న భర్త ఆడపడుచు, అత్తలపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. కలిదిండి శివారు ఇందిరా కాలనీకి చెందిన పి.సౌజన్య (39)కి రాజమండ్రికి చెందిన రంజిత్ ఖాన్ 2013లో ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొంతకాలంగా అదనపు కట్నం తెమ్మని భర్తతోపాటు ఆడపడుచు, అత్తలు వేధింపులకు పాల్పడుతూ కులం పేరుతో దూషిస్తున్నారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	124, 133, 144
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	


ఆలయంలో నిర్విరామ భజన చేస్తున్న దృశ్యం

72 గంటల భజన

కైకలూరు, మే 4(ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్రస్వామి 45వ వార్షిక ఆరాధన సందర్భంగా సర్వనామ సంకీర్తన, త్రయాహ్న మహోత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. ఆదివారం కైకలూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో మూడు రోజుల ఏకధాటి భజన కార్యక్రమం 72 గంటల పాటు నిర్విరామంగా నిర్వహిస్తున్నారు. కైకలూరు పట్టణ స్వర్ణకార సంఘం ఆదివారం నుంచి బుధవారం వరకు భజనా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ భజనకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. శ్రీ కామాక్షి పట్టణ స్వర్ణకార సంఘం సభ్యులు అనుపోజు భాస్కరరావు, టేకి వెంకట సత్యనారాయణ, అనుపోజు నాగేశ్వరరావు పాల్గొన్నారు.


బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ వీరభద్రరావు

బస్‌షెల్టర్ ప్రారంభం

ముదినేపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి, భీమవరం జాతీయ రహదారిలో పెయ్యేరు వైఎస్ఆర్ కాలనీ వద్ద దాతలు నిర్మించిన బస్‌షెల్టర్‌ను ఆదివారం సాయంత్రం ఎస్ఐ వీఎస్ వీరభద్రరావు ప్రారంభించారు. ఆ గ్రామానికి చెందిన ముప్వా వెంకట రమణారావు, సత్యవతి దంపతులు రూ. లక్షా 25 వేల విరాళంతో నిర్మించిన ఈ బస్‌షెల్టర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శేషుబాబు, దాకరం, రుద్రపాక, సర్పంచ్‌లు జాస్తి రాజా, జంగం రాజు, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు భూపతి రవీంద్ర, బీజేపీ యువ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు ముప్వా ఫణీంద్ర, పరసే నాగరాజు పాల్గొని దాతలను అభినందించారు.

కట్నం వేధింపుల కేసు

ముదినేపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): కట్నం వేధింపులపై ముదినేపల్లి పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ వీరభద్రరావు కథనం ప్రకారం వడాలికి చెందిన భోజనపు వెంకట గణేష్‌కు అల్లూరికి చెందిన బిందు రమ్యకు నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో గణేష్ కట్నం తీసుకోలేదు. అనంతరం ఒక పాప పుట్టింది. ఈ పరిస్థితుల్లో కొంత కాలంగా పుట్టింటి నుంచి సొమ్ములు తెమ్మని రమ్యను భర్త, అత్త వేధించడం ప్రారంభించారు. దీంతో ఆమె మూడు నెలల క్రితం పుట్టింటికి వెళ్ళిపోయి తనను అత్తవారింట పెడుతున్న ఇబ్బందులను ముదినేపల్లి పోలీసులకు తెలియజేయగా పోలీసులు పలు సార్లు కౌన్సెలింగ్ ఇచ్చి రమ్యను కాపురానికి పంపడం కూడా జరిగింది. అయినా ఆమెపై సొమ్ములు తెమ్మని వేధింపులు ఆగలేదు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

దళితకాలనీలో నిలిచిన వర్షం నీరు


చనుబండ పాత దళితవాడ కాలనీలో నిలిచిన వర్షం నీరు

చాట్రాయి, మే 5(ఆంధ్రజ్యోతి): ఆదివారం కురిసిన భారీ వర్షానికి చనుబండ పాత దళితవాడ కాలనీలో వర్షం నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయిన్లు లేకపోవటంతో కొనేళ్ళ నుంచి కొద్ది పాటి వర్షం కురిసినా నీరు నిలిచి అవస్థలు పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం నీరు ఎప్పుడు గృహాల ముందు నిలిచి ఉండటం వలన దుర్వాసనతో పాటు దోమలు ఈగలు ప్రబలి రోగాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇక్కడ రోడ్డు మెరక చేసి వర్షం నీరు బయటకు వెళ్ళే విధంగా డ్రెయిన్లు ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిదులకు నాయకులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బాలగోవింద్ కుటుంబాన్ని ఆదుకుంటాం

నూజివీడు, మే 4 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామంలో ఆదివారం అకాలవర్షం, ఈదురుగాలు లతో ఇంటిపై చెట్టు కూలి మృతి చెందిన మామిళ్ళ బాలగోవింద్ (12) కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటా మని రాష్ట్రమంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆ కుటుంబ వివరాలు తెలుసుకున్న మంత్రి ఆసుపత్రిలో మృతదేహాన్ని సందర్శించి కుటుంబానికి రూ.25వేలు మట్టిఖర్చులు ఇచ్చారు. అంతేకాక ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి ప్రభుత్వం తరపున అందే పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలు వచ్చేలా చూస్తామని తెలిపారు. వీరికి పక్కాఇల్లు నిర్మించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.